క్లుప్తంగా

దేశ రాజకీయాల్లో కేసీఆర్ కీలకం

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్



పటాన్‌చెరు టౌన్: మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, ఆయన ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం పటాన్‌చెరు నుంచి పాదయాత్రగా వస్తానని ఏడుకొండల వెంకన్నను మొక్కినట్లు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు ముదిరాజ్ అన్నారు. పటాన్‌చెరుకు చెందిన 30 మంది ఎన్ఎంఆర్ యువసేన సభ్యులతో తిరుపతి అలిపిరి నుంచి కాలినడక ఏడుకొండలు ఎక్కి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ... కేసీఆర్ లాంటి విజన్ ఉన్న నాయకుడు ఉద్యమనేత దేశ రాజకీయాలకు అవసరముందన్నారు.

బీబీఏ కోర్సు ప్రారంభం

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023 -24 విద్యా సంవత్సరానికి కళాశాల విద్యాశాఖ కమిషనర్ నూతనంగా బీబీఏ కోర్సును మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో మొదటి సంవత్సరం కళాశాలలో బీబీఏ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులు ఆన్‌లైన్ దోస్త్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిషన్ పొందవచ్చని సూచించారు. డిగ్రీలో అడ్మిషన్ పొందడానికి మూడో విడతలో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునే విద్యార్థులు బీబీఏ కోర్సుకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరును ఎంపిక చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశం వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి

రాయికోడ్(అందోల్) : రైతులు విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు మల్లికార్జున్ పాటిల్, ఏఓ అభినాష్ వర్మ అన్నారు. జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా మండలంలోని సింగితం గ్రామ రైతువేదికలో రైతులకు బుధవారం ఉచితంగా కంది, మినుము విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు పొందిన రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదై ఉంటాయన్నారు. పంట ఉత్పత్తుల విక్రయ సమయంలో ఉపయోగపడుతోందన్నారు. విత్తనాలు పొందిన రైతులు ఇతర పంటలు సాగు చేస్తే విక్రయ సమయంలో ఇబ్బందులు వస్తాయన్నారు. దీంతో విధిగా రైతులు పొందిన విత్తనాలు సాగు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ సంతోష్ పాటిల్, ఏఈఓ మల్లేశం, రైతులు ఉన్నారు.

ఘనంగా పసక జాతర



ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్‌లో బుధవారం క్రైస్తవులు పసక జాతర నిర్వహించారు. కృష్ణాపూర్ పస్తరెట్ ప్రెసిబిటర్ ఇన్‌చార్జి రెవరెండ్ ఎం.ప్రసాద్ ఆధ్వర్యంలో గ్రామ శివారులో ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ప్రజలు సుఖసంతోషంతో ఉండాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని ప్రార్థించారు. రెవరెండ్ ఆనంద్, వినయ్‌కుమార్, ప్రాపర్టీ సెక్రటరీ జి.దేవదాస్, సెక్రటరీ ముల్కి సాయిలు, పాస్టరెట్ బాధ్యులు దేవయ్య, ముల్కి పెద్దసాయిలు, భారతి, స్వప్న పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి

కొండాపూర్(సంగారెడ్డి): పెరిగిన ధరలకనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం పరిశ్రమల్లో పనిచేస్తున్న కాంట్రాక్టుల కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ 73 షెడ్యూల్ ఎంప్లాయిమెంట్‌లో పనిచేస్తున్న కార్మికులకు 15 సంవత్సరాలుగా కనీస వేతనాలు సవరించలేదన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం కమిటీల పేరిట కాలయాపన చేస్తోందన్నారు. కనీస వేతనాలు పెంచాలని లేని పక్షంలో పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు.

నేడు వారాంతపు సంత

కోహీర్(జహీరాబాద్): ఆషాఢ మాసోత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని పట్లూర్ బేస్ భవానీ మాత మందిరం వద్ద గురువారం వారాంతపు సంత నిర్వహిస్తున్నామని గ్రామ పంచాయతీ అధికారులు తెలిపారు. ఈ మేరకు ప్రధానవీధుల్లో దండోరా వేయించారు. ప్రతి యేటా వర్షాలు సంవృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని ఆషాఢమాసంలో సంత ఏర్పాటు చేసి అమ్మవారికి బోనాలు సమర్పిస్తామని తెలిపారు.

కొంచెం ఇష్టం.. కొంచెం కష్టం



మర్వెల్లిలో పత్తి పంటలో నిలిచిన వర్షపు నీరు

వట్‌పల్లి(అందోల్): మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. పలు గ్రామాల్లోని పత్తి చేలల్లోకి నీరు చేరాయి. వరద దాటికి మొక్కలపై మట్టి పేరుకుపోవడంతో పంట దెబ్బతిన్నట్లు రైతులు చెబుతున్నారు. పత్తి పంటకు నష్టం జరుగకుండా ఉండేందుకు పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు తీసివేసే ప్రయత్నం చేశారు. మండల పరిధిలోని బిజిలీపూర్-మర్వెల్లి గ్రామాల మధ్య గల ప్రధాన రహదారి వర్షపు నీటిప్రవాహ దాటికి ఒకవైపు పూర్తిగా కొట్టుకపోయింది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

వర్షం కోసం పాదయాత్ర

నారాయణఖేడ్: వర్షాలు సమృద్ధిగా కురవాలని సిర్గాపూర్ మండలం వాసర్ భజనమండలి సభ్యులు కోరుకున్నారు. సిర్గా పూర్ మండలం వాసర్ భజన మండలి స భ్యులు, భక్తులు, మహిళలు తలలపై కలశాలు పెట్టుకొని పాదయాత్రగా 11 గ్రామాలకు వెళ్లి, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజనలు, కీర్తన లు బుధవారం నిర్వహించారు. పాదయాత్రికులకు డీసీసీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పండ్లు, ఫలహారాలు, తాగునీటి బాటిళ్ల సదుపాయాలు కల్పించారు.



రాయికోడ్(అందోల్): మండలకేంద్రం రాయికోడ్‌తోపాటు వివిధ గ్రామాల్లో బుధవారం తెల్లవారుజాము జడివాన కురిసింది. దీంతో వాగులు, కాలువలు ప్రవహించాయి. వర్షాకాలం ప్రారంభమైన నాటి నుంచి అతిపెద్ద వర్షం కురవడంతో రైతులు ఒకింత సంతోషం వ్యక్తం చేశారు. అయితే వాగులు, కాలువల పరిసర ప్రాంతాల్లోని పంట పొలాలు, లోతట్టు పంటల పొలాల్లో సాగు చేస్తున్న పంట మొక్కలకు నష్టం కలిగింది. పంట పొలాల్లో నీరు నిల్చాయి. ఏకంగా భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఏడేళ్ల తర్వాత ఒక రోజులో ఇంత పెద్ద వర్షం ఇప్పుడే నమోదైందని చెప్పారు.

డిజిటల్ బోధనతో మేలు

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): డిజిటల్ బోధనతో విద్యార్థులకు పాఠాలు సులువుగా అర్థమవుతాయని మండల విద్యాధికారి దండు అంజయ్య అన్నారు. మండలపరిధిలోని మద్దికుంటలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా డిజిటల్ బోధన విధానం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, దృశ్యరూపంలో పాఠాలు బోధిస్తే విద్యార్థులు మర్చిపోకుండా గుర్తించుకుంటారన్నారు. డిజిటల్ తరగతులు ఆసక్తికరంగా ఉంటాయని, దీంతో వి ద్యార్థుల హాజరు శాతం పెరుగుతోందన్నారు. కా ర్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గు ణాకర్, సాజిదాబేగం, శ్రీనివాస్, బి.శ్రీనివాస్, సీ ఆర్పీలు రాజేశ్వర్, నాగరత్నం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సంగారెడ్డి మున్సిపాలిటీ: 28వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి మున్సిపల్ చైర్మన్ బొంగుల విజయలక్ష్మి రవి భూమి పూజ నిర్వహించారు. ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 36 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఉమ మహేశ్వరి, మాజీ కౌన్సిలర్ ప్రదీప్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : డివిజన్ పరిధిలోని కాలనీలలో పూర్తిస్థాయిలో రోడ్ల సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ పుష్పనగేష్ తెలిపారు. బుధవారం కాకతీయనగర్‌లో నూతనంగా వేయనున్న సీసీ రోడ్ల ప్రాంతాలను అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాకతీయనగర్ కాలనీ సీసీ రోడ్ల అభివృద్ధి కోసం రూ.80లక్షలు మంజూరయ్యాయన్నారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్రాన్ని అప్పుల పాల్జేసిన బీఆర్ఎస్

- బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌గౌడ్

పటాన్‌చెరు టౌన్: రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ విమర్శించారు. బుధవారం పార్టీ పట్టణ శ్రేణులతో కలిసి శ్రీకాంత్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను హైదరాబాద్ శామీర్ పేట్‌లోని ఆయన నివాసం వద్ద కలిసి సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యుడు దేవేందర్ గౌడ్, భారతీనగర్ డివిజన్ అధ్యక్షుడు మన్నే శ్రీకాంత్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, జిన్నారం మండల అధ్యక్షుడు బండి శ్రీకాంత్ గౌడ్, బీజేవైఎం పటాన్‌చెరు అసెంబ్లీ కన్వీనర్ రాజగోపాల్ యాదవ్, పోచారం బీజేవైఎం నాయకులు సందీప్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు జోగుధన్ రాజ్, సోషల్ మీడియా కన్వీనర్ సంగమేష్ ఎస్ఆర్‌కే యువసేన సభ్యులు శకిల్ పాల్గొన్నారు.

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ఈటల రాజేందర్‌ను నాయకులు అంంజిరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోదావరి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక నేతలు కలిసి సన్మానించారు. ఈటలను ఆ యన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

జిన్నారం(పటాన్‌చెరు): ఈటల రాజేందర్‌ను బీజేపీ మండల నాయకులు బుధవారం కలిసి సన్మానించారు. నాయకులు ప్రతాప్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్, రమేశ్, జగన్‌రెడ్డిలు కలిసి సన్మానించారు.

బీజేపీలోకి చేరికలు

సదాశివపేట (సంగారెడ్డి): బీజేపీ నియోజకవర్గ నాయకుడు శివరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లోని ఈటల రాజేందర్ నివాసంలో కొండాపూర్, సంగారెడ్డి సదాశివపేట మండలాల్లో ఉన్న పలు గ్రామాల నుంచి 50 మంది యువకులు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు.నియోజకవర్గ బీజేపీ నాయకులు శివరాజ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వెళ్లి ఈటలను శాలువాతో సన్మానించారు. పార్టీ మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కోరు సంగమేశ్వర్, సంగారెడ్డి నియోజకవర్గ కో కన్వీనర్ రేజింతల సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర నాయకులు కొండాపురం జగన్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించని ఈజీఎస్ ఉద్యోగులు



కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

వట్‌పల్లి(అందోల్): ఈజీఎస్ ఉద్యోగులు బుధవారం ఉదయం 11 గంటలవుతున్నా .. కార్యాలయానికి రాలేదు. దీంతో కార్యాలయంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. 10.55 గంటలకు కార్యాలయానికి చేరుకొన్న కంప్యూటర్ ఆపరేటర్ సాయి ఒక్కడే ఆఫీస్‌కు వచ్చాడు. ఆఫీస్‌లో ఉద్యోగులు మొత్తం ఏడుగురు ఉంటారు. ఏపీఓ, ఈసీ ఒకరు, కంప్యూటర్ ఆపరేటర్లు ఇద్దరు, టెక్నికల్ అసిస్టెంట్లు ముగ్గురుంటారు. కాగా మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల విషయంలో కార్యాలయానికి వచ్చిన ప్రజలు కుర్చీలు ఖాళీగా దర్శనమివ్వడంతో ఏం చేయాలో తెలియక నిరాశతో వెనుదిరిగారు.ఈ విషయమై ఎండీపీఓ జగదీశ్వర్ వివరణ కోరగా, సమయపాలన పాటించని అధికారుల జీతాల్లో కోత విధిస్తామన్నారు. ఏపీఓ శ్యామ్ వివరణ కోరగా తాను మర్వెల్లి, ఖాదిరాబాద్ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నానన్నారు. సిబ్బంది ఒక్కోరోజు సమయానికంటే ఎక్కువ గంటలు పని చేస్తున్నారని, దీంతో కొంత ఆలస్యమై ఉండొచ్చన్నారు.

నేటి నుంచి జీపీ కార్మికులు సమ్మెలోకి

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామ పంచాయతీ సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలని, కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. బుధవారం సంగారెడ్డిలోని సీఐటీయూ కార్యాలయంలో గ్రామపంచాయతీ కార్మికుల ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ, గ్రామపంచాయతీ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. కారోబర్ బిల్ కలెక్టర్లకు సహాయ కార్యదర్శులు గుర్తించాలని, వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లు నెరవేర్చాలని కోరినా నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఎంపీడీవో ఆఫీస్‌ల ముందు టెంట్ వేసి సమ్మెలోకి వెళ్తున్నారన్నారు. నేటి నుంచి జరిగే రాష్ట్ర సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లు, గ్రామపంచాయతీ కార్మికులు పెద్దఎత్తున మండలాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి యాదగిరి గ్రామపంచాయతీ యూనియన్ నాయకులు వెంకటయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాయిలు

ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కృషి



నగదును అందజేస్తున్న సర్పంచ్ భాగ్యవతి

కొండాపూర్(సంగారెడ్డి): గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని మల్కాపూర్ సర్పంచ్ కొత్తకాపు భాగ్యవతి తెలిపారు. బుధవారం ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన 35 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.వెయ్యిలు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రుక్మిణి, ఉపాధ్యాయులు, ఎస్ఎంఎస్ చైర్మన్ మల్లేశం పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్త దానం చేస్తున్న దృశ్యం

సంగారెడ్డి మున్సిపాలిటీ: రక్తదానం ప్రాణదానంతో సమానమని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర సిద్ధాంతి అన్నారు. సాహితి హాస్పిటల్ అధినేత రాము గురుస్వామి జన్మదినం సందర్భంగా ఆస్పత్రి ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని బ్రహ్మశ్రీ డాక్టర్ శ్రీ మహేశ్వర సిద్ధాంతి ప్రారంభించారు. శిబిరంలో 100మందిపైగారక్తదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ **పాఠ్యపుస్తకాలు పంపిణీ**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని కృష్ణాపూర్ ఉన్నత పాఠశాలలో జెడ్పీటీసీ నర్సింహారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ అలీ బుధవారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కిష్టారెడ్డి, హెచ్‌ఎం రాంమోహన్‌రావు, నాయకులు ఉప్పరి అంజయ్య సాగర్ పాల్గొన్నారు.

◆ **9న సివిల్స్ శిక్షణ పరీక్ష**

సంగారెడ్డి టౌన్ : షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సివిల్స్ మెయిన్స్ శిక్షణకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల ఉపసంచాలకుల అభివృద్ధి శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారు www.tsstudycirc ecg.in వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు పొందాలని పేర్కొన్నారు. ఈనెల 9న ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం వరకు పరీక్ష ఉంటుందన్నారు.

◆ **ఆర్థిక సాయం అందించాలి**

ఝరాసంగం (జహీరాబాద్): కేంద్రీయ విద్యాలయం ఆవరణలోని గోడ కూలీ గాయాలైన తన కుమారుడికి ఆర్థిక సాయం అందించాలని తండ్రి మోహన్ కోరారు. బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా తండ్రి మోహన్ మాట్లాడుతూ, ఈనెల 3న మధ్యాహ్నం భోజన విరామం సమయంలో పాఠశాల ఆవరణలో మూత్రశాల గోడకూలి కుమారుడి ఎడమకాలికి తీవ్రగాయమైందన్నారు. దీంతో సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడన్నారు. అధికారులు తమకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

◆ **రోడ్డు పనులు ప్రారంభం**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని ఇందిరానగర్ పంచాయతీలో ఆత్మ చైర్మన్ రాంసింగ్, జెడ్పీటీసీ నర్సింహారెడ్డి బుధవారం రోడ్డు పనులు ప్రారంభించారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సీడీపీ నిధులు రూ. 5 లక్షలు కేటాయించారని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుర్రపు జలంధర్, ఎస్.జనర్ధన్, రాములు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

◆ **పొజిషన్ పట్టాలు ఇవ్వాలి**

సదాశివపేట (సంగారెడ్డి): పట్టణ పరిధిలోని ముగ్ధంనగర్‌లో కొన్నేళ్లుగా నుంచి పూరి గుడిసెలు వేసుకొని నివసించే పేదలకు పొజిషన్ పట్టాలు మంజురు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పీ వినోద డిమాండ్ చేశారు. బుధవారం ఉదయం 11 గంటలకు ముగ్ధంనగర్‌లోని గుడిసెల ప్రజలతో సమావేశమై వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో ఆ కాలనీలో ముసుగు రోగాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు లేని కారణంగా మున్సిపల్ అధికారులు సమస్యలు పరిష్కరించడం లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న ఈ సందర్భంగానైనా గుడిసె వాసులకు పొజిషన్ పట్టాలు మంజురు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రిహానాబేగం, బిపాష, రాజమ్మ, వాహిదాబేగం, నిర్మలబాయిదేవి పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా కృష్ణ**

హత్నూర (సంగారెడ్డి): కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా సాధుల్‌నగర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కృష్ణను నియమిస్తూ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

◆ **8 నుంచి క్విజ్ కాంపిటీషన్**

నారాయణఖేడ్: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటేషన్ ఈనెల 8, 9వ తేదీల్లో మరోదఫా నిర్వహించనున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు డా.సంజీవరెడ్డి తెలిపారు. ఈనెల 2, 3, 4వ తేదీల్లో నిర్వహించగా వివిధ కారణాలతో పరీక్షకు గైర్హాజరైన యువత విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు.ఆసక్తి గల వారు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

◆ **ఫ్లెక్సీల చించివేత సరికాదు**

జిన్నారం(పటాన్‌చెరు): చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు సంబంధించిన ఫ్లెక్సీలు చింపేయటం సరైంది కాదని ఎన్ఎంఆర్ యువసేన నాయకులు అన్నారు. ఫ్లెక్సీలను చింపటంతో బుధవారం ఎన్ఎంఆర్ యువసేన నాయకులు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. అనంతరం యువసేన నాయకులు పుట్టి భాస్కర్, నీలం రాము, తదితరులు మాట్లాడుతూ నిందితులను గుర్తించి పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

◆ **అమీన్‌పూర్ కమిషనర్‌గా జ్యోతిరెడ్డి బాధ్యతల స్వీకరణ**



పటాన్‌చెరు: అమీన్‌పూర్ కమిషనర్‌గా ఎ.జ్యోతిరెడ్డి పదవీ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం కమిషనర్‌కు చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి స్వాగతం పలికారు. చైర్మన్.. కమిషనర్‌కు అమీన్‌పూర్ సమస్యలు వివరించారు. అమీన్‌పూర్ కమిషనర్‌గా ఇప్పటి వరకు పని చేసిన సుజాత సంగారెడ్డి మున్సిపాల్టీ కమిషనర్‌గా బదిలీ అయిన విషయం తెలిసింది.

◆ **అర్హులకు దళితబంధు వర్తింపజేయాలి**

కంది(సంగారెడ్డి): అర్హులైన పేద దళితులందరికీ దళితబంధు వర్తింపజేయాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీపీ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికీ 1,100 మంది లబ్ధిదారులను గుర్తించి దళితబంధు ఇస్తామని ప్రకటించిందన్నారు. అర్హులైన పేద దళిత కుటుంబాలను గుర్తించాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు శేఖర్ తదితరులు పాల్గొన్నారు

◆ **పోచమ్మ తల్లికి పూజలు**

జిన్నారం(పటాన్‌చెరు): మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో గల జ్యోతినగర్‌లో బోనాల ఉత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పోచమ్మ తల్లి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. స్థానిక కౌన్సిలర్ చంద్రారెడ్డి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

◆ **రుణాల రెన్యూవల్‌తో ముడిపెట్టొద్దు**

కొండాపూర్(సంగారెడ్డి): పంట రుణాలు రెన్యూవల్ చేసుకుంటేనే రైతుబంధు, ఆసరా పెన్షన్‌లు ఇస్తామనడం సరికాదని సీపీఎం నాయకుడు అశోక్ హితవుపలికారు. పంట రుణాలకు రైతుబంధు, ఆసరా పెన్షన్‌లతో సంబంధమేమిటని ప్రశ్నించారు. సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ నగేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ రుణాలు రెన్యూవల్ చేసుకోవాలని బ్యాంక్ అధికారులు చెబున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం లో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

◆ **ఆలయాలు ముస్తాబు**

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆషాఢ మాసం వేడుకలకు సంగారెడ్డిలోని దేవాలయాలను ముస్తాబు చేస్తున్నారు.మున్సిపల్ నిధుల ద్వారా పలు దేవాలయాలకు రంగులు వేసి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోని దుర్గా భవాని, ఏళ్లమ్మతల్లి, పోచమ్మ, మైసమ్మ, నల్లపోచమ్మ తదితర దేవాలయాలు సుందరంగా తీర్చిదిద్దారు. ఆషాఢ మాసంలో ఈ దేవాలయాల వద్ద బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.



◆ **విద్యార్థినికి ఆర్థిక సాయం**



కొండాపూర్(సంగారెడ్డి): ఉన్నత విద్య అభ్యసించేందుకుగానూ మండలంలోని మల్లెపల్లికి చెందిన సమ్మయ్య కూతురుకు ఆత్మకూరు నాగేష్ ఫౌండేషన్ చైర్మన్ నాగేశ్ ఆర్థిక సాయం అందించారు.హైదరాబాద్‌లోని సెంట్ మేరీస్ ఇంజినీరింగ్ కాలేజీలో రెండో సంవత్సరం ఇంజినీరింగ్ చదువుతున్నది. సంగారెడ్డి నియోజకవర్గంలో సేవ చేయడానికి సంగారెడ్డి, సదాశిపేట పట్టణాల్లో ఫౌండేషన్ కార్యాలయాలు ఎప్పుడూ తెరిచే ఉంటాయని నాగేశ్ అన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. చంద్రారెడ్డి -9912220353
కె. సంగారెడ్డి -9010294400